శిథిల శిల్పం

శ్రీ సనగరం పార్థసారథి

చూస్తుండగానే ఒక నక్షత్రం రాలిపోయింది ఎక్కడో.

'ఒక తార రాలిపోయింది. దాని తరం గడచిపోయింది' అనుకొన్నది మనస్సులో.

*   *   *

అది పెంకుటిల్లు. ఆ యింట్లో ఆ గది. గదిలో నులకమంచంమీద పడుకొని, ఎదురుగ వున్న కిటికీగుండా చూస్తూ ఆలోచిస్తున్నది రేవతి.

పెంకుల మధ్య అక్కడక్కడ యేర్పడిన సందులద్వారా గ్రుడ్డివెన్నెల సన్నని కిరణాలుగా పడుతోంది.

కిటికీని అనుకొని ప్రాకిన మల్లెతీగ వెనుకగా జామచెట్టుంది. మంచంమీద పడుకున్న రేవతికి జామచెట్టు పైభాగంలో ఆకాశం కనిపిస్తోంది.

రేవతి చూస్తుండగానే ఒక నక్షత్రం రాలిపోయింది.

'ఒక తార రాలిపోయింది. దాని తరం గడచిపోయింది' అనుకొన్నది మనస్సులో. మనస్సులో అనుకొన్నది పెదిమలవరకు ప్రాకి వేదాంతపు చిరునవ్వుగా మెరసి మాయమయ్యింది.

జామచెట్టుగాలి మల్లెతీగెమీదుగా వచ్చింది. మత్తుగా చలించిపోయింది రేవతి. జామపండుకన్న తీయనిదనం ఆమె మనస్సు నిండిపోయింది.

ఇక ఆ గదిలో వుండలేకపోయింది. ఏదో పొగలు పొగలమధ్య వున్నట్టుగా బాధపడసాగింది. మెల్లగా లేచి గది తలుపు తీసి చూసింది.

ఇల్లు నిశ్శబ్దంలో మునిగిపోయింది. అమ్మా, నాన్న, ముగ్గురు చెల్లాయిలు హాయిగా నిద్రపోతున్నట్టున్నారు.

'అదృష్టవంతులు!'

గాఢంగా నిట్టూర్చింది.

జామచెట్టుక్రింద బండమీద కూర్చొనింది. పంజరంలోనుండి బయటపడ్డ చిలుక మనస్సులా హాయిగావుంది రేవతికి.

'అబ్బా, ఎంతో హాయిగావుంది.'

రెండు చేతులను వెనక్కువూని ఆకాశంలో అర్ధచంద్రుని వంక చూస్తూ అనుకొనింది.

మల్లెమొగ్గలు అప్పుడప్పుడే విచ్చుకొంటున్నాయి. అవి విరజిమ్మే యవ్వన సౌరభం రేవతికెంతో వింతయిన హాయిగావుంది.

రేవతి బుద్ధి ఎరుగున్ననాటినుండి మల్లెలు ఎన్నోసార్లు వాసన చూసింది. తలలో తురుముకొనింది. కానీ, ఏనాడు యింత వింతగా అనుభూతి చెందలేదు. ఎందుకో తన మనస్సును యింతవరకు యింతగా స్పందింపజేసే అనుభూతి కలుగలేదేమాయని ఆశ్చర్యపోయింది.

చల్లటిగాలి వెచ్చగా తగిలేసరికి ఆమె దేహం ఒక్కసారిగా పులకించింది. గదిలోకన్నా, బండమీదే హాయిగా వుందనుకొన్నది.

తేనెటీగ 'గుయ్'మని శబ్దంచేస్తూ ఒక్కొక్క పువ్వునే స్పృశిస్తూ తిరుగుతోంది. ఆ యీగ యీ పూలకేదో రహస్యం చెబుతున్నదేమో ననుకొనింది. 'ఏమిటో ఆంతరహస్యం' తను పూవుగ పుట్టివుంటే తనకూడా తెలిసివుండేది...ఏమో యీ వేళ తన

ఆలోచనలు దారి తప్పినట్టున్నాయి – అనుకొన్నది. నరాల్లో శక్తి నశించినట్టు, బలహీనత కృంగదీస్తున్నట్టుగా ఫీలయింది.

మోచేతివి తలకు ఆదరువుగా పెట్టుకొని బండమీద పండుకొన్నది.

ప్రక్కయింటి దొడ్లో రాక్షసి కూతురిలా అడ్డదిడ్డంగా పెరిగిన వేపచెట్టువుంది. చెట్టుమీద పక్షి గూడుంది. ఆ గూట్లో పకులు రొద జేస్తున్నాయి.

ఆ చెట్టును, ఆ గూటిని, ఆ పకులను రోజూ చూస్తూవేవుంది రేవతి.

'తనుకూడ ఆజంటలో ఒకటియై పుట్టుంటే ఎంతో హాయిగా, మధురంగా గడిపే దీర్ఘరాత్రి'.

అని జామచెట్టుతో మొర పెట్టుకోవాలనుంది రేవతికి.

'కానీ ఏలా]?]

'తన మనస్సుకు భాషవుందికాని, రవంలేదు. చెట్టుకూడ అంతేవేమో ? తను యితరులతో ఎంత చెప్పుకోగలదో చెట్టుతోకూడా అంతే. పైగచేస్తే దాని కర్థమవుతుందా ? తన మనస్సులోని ఆంతర్యం గ్రహిస్తుందా ?...ఛీఛీ...ఏమిటో పిచ్చిదాని రాతలా అనూహ్యమయిన వూహలు' అని అనుకొనబోయింది, కాని మనస్సు ఆ వూహలను కొట్టిపారేసింది.]

రోజూచూసే ఆకాశం, చంద్రుడు, చుక్కలు. కాని యీ రోజు క్రొత్తగా తోస్తున్నాయి రేవతికి.

'చంద్రుణ్ణి అందుకోడానికి ఆ నక్షత్రం ఎందుకంత వేగిరపడుతోంద'ని ప్రశ్నించుకొనింది.

వేపచెట్టుమీద గూట్లోని పకులు శబ్దం మానివేశాయి.

రేవతి ప్రశ్నకు సమాధానం మనస్సులో ఒక మూల మెదలింది.

'వాటి అదృష్టంలో తనకు శతాంశమయినా వుంటే, నేను అదృష్టవంతురాలి నయ్యేదాన్ని.'

చెమర్చిన కనులు మూసుకొనేటప్పటికి నిద్ర ముంచుకొచ్చింది.

*   *   *

తనది రేవతీ నక్షత్రమట. నక్షత్రమాలలో రేవతి కడపటిది. నాన్న సంతానంలో తను మొదటిది.

అమ్మ చెప్పిందాకా తన వయస్సు తనకుసరిగ్గా తెలియదు. అమ్మ ఒకసారి నాన్నతో అంది. 'రేవతికి యిరవై ఆరేళ్లు దాటాయి. దానికి పెళ్ళి పెటాకు లేమయినా రాసివుందా?'

ఎందుకో అమ్మకు తనంటే మహాద్వేషం. పరోక్షంలోకూడ ఆ కోపాన్ని చూపిస్తూవుంటుంది.

నాన్నమాత్రం కరుణామయుడయిన వేదాంతి. అందుకే, 'పాపం! భగవంతుడెలా వ్రాసిపెట్టాడో అన్నిటికీ వాడిదయ కలసిరావాలి.' అన్నాడు.

ఏమయినప్పటికీ యింట్లో తను ఒకతినని ఎవరు పట్టించుకోరు. తన చెల్లెళ్లు సరేసరి. తన నెవరు 'అక్కా'యని పిలిచినట్లు గుర్తులేదు.

తను కర్మ చేసుకొని పుట్టిందా?

రాధ, సుజాత యిద్దరే తనకు స్నేహితురాండ్రు. వారిద్దరి పెళ్లికికూడ తను వెళ్లింది. వారిద్దరున్నపుడు తనకు మరో ఆలోచనే వుండేది కాదు. ఏవేవో చెప్పేవారు. నవ్వించేవారు. తనకు నవ్వడంకూడ సరిగ్గా చేతకాదు. వారి నవ్వుకంటే స్వచ్ఛంగా, తీయగా నవ్వాలని వుంది. ఒక్కసారి గలగలమని మాట్లాడాలని వుంది. నగకోసం పాపాయి గొంతు నులిమేసిన కర్కోటకుడయిన దొంగలా, వినోదంకోసం తన నోరు మూసేశాడు దేవుడు.

అందరు అనుకునే అనాథనాథుడు.........

ఆలోచిస్తూనే కుమిలి కుమిలి ఏడుస్తోంది రేవతి.

రేవతి దుఃఖంలో పాలుపంచుకొనే అనురాగం వున్నది, ఆమె వేసుకున్న దిండుకు మాత్రమే. అందుకే ఆమె దుఃఖంలో సగభాగం గ్రహించి గుండెను బరువెక్కించుకొని తడిసిపోయింది.

త్రవ్వకాలలో శిథిలమయిన శిల్పం కన్పించినా భూగర్భ పరిశోధకులు సంతోషంతో ఎగిరి గంతులు వేస్తారట.

తనుపుట్టినప్పుడు అమ్మ కళ్లనీరు పెట్టు కొంటే, నాన్న ఓదార్చాడట అంతా దేవుడిమీదకు నెట్టివేస్తూ.

తను పుట్టిన చాలకాలంవరకు పేరు పెట్ట లేదట.

'అంతటి వికారానికా నామకరణం?' అని అమ్మ నాయనమ్మమీద విరుచుక పడేదట, ఆ ప్రసక్తి వచ్చినప్పుడల్లా.

వీరిద్దరిపోరు భరించలేక నాన్న ఒక రోజు, జన్మ నక్షత్రం గుర్తుకు తెచ్చుకొని, రేవతి అని పిలిచాడట.

'కాకిపిల్ల కాకికిముద్దు, ఎందుకని?'

తన ఎనిమిదేళ్ల చెల్లెలు అమ్మను అడుగు తోంది ఒకనాడు పాఠాలు చదువుకొనే సమయంలో.

'అది దానికి తల్లికదూ? అందుకని.' అమ్మ జవాబిచ్చింది.

అనుకోకుండా గతం గుర్తుకొచ్చేసరికి 'తను కాకిపిల్లకూడ అయిందికాదు. అందుకని...?' అని అనుకొనింది.

నవ్వుతోపాటు దుఃఖం ముంచుకొచ్చింది రేవతికి.

కొంతసేపయిన తరువాత పైటతో ముఖం తుడుచుకొని, కళ్లు వొత్తుకొని గది బయట కొచ్చింది.

ఏదయినా పని కల్పించుకొని చేస్తేగానీ మన స్సుకు విశ్రాంతి వుండదు. అమ్మ ఎప్పుడు రేవతికి పనిజెప్పదు. చెల్లెళ్లకు దగ్గరకు రావడానికే భయం.

ఇంట్లో అందరు తొందర పనులున్నట్టుగా హడావుడిగా కనిపించారు. ఎందుకంత సంబరంగా వున్నారో రేవతికి తెలియదు. ఎవ్వరు చెప్పలేదుకూడ.

పెద్దచెల్లెలు నిర్మల మల్లెమొగ్గలు దండకడుతూ కూర్చొనివుంది. తనుకూడా సహాయం చేయాలను కొని వెళ్లి దగ్గరగా కూర్చొనింది రేవతి.

నిర్మల రేవతితో మాట్లాడక మాల కట్టడ ములో నిమగ్నురాలయ్యింది. రేవతికూడ మరో దండ కట్టింది. రేవతి దండ కడుతుండగా, నిర్మల తల దువ్వి జడవేయమని నూనె, దువ్వెన, అద్దం తెచ్చింది.

నిర్మల అంత చనువుగా వున్నందుకు ఆనంద పడింది రేవతి. నిర్మలకు వదలుగా జడవేసి మల్లె మొగ్గలదండ తురిమింది. ముఖానికి పౌడ రద్దు కొనింది నిర్మల. రేవతి నిర్మల కళ్లకు కాటుక పెట్టి, చక్కటి తిలకంతీర్చింది.

అమ్మ వంటయింట్లో పిండివంటలు చేస్తు న్నట్టుంది. ఇల్లంతా తీపువాసన చుట్టుకొనింది.

ఇంత సాయంత్రంవేళ పిండివంట లెందుకు చేస్తున్నారో తెలుసుకోవాలని వుంది. కాని అది వీలు కానట్టిది.

వంటయింట్లోనుండి అమ్మ నిర్మలను కేకేసింది.

'పెట్టెలోనుండి మంచి చీరతీసి కట్టుకో ?'

నిర్మల రేవతి వైపొకసారి చూచి పెట్టెలున్న గదిలోనికి వెళ్లింది. రేవతికూడ ఆమెవెంట వెళ్లింది గదిలోనికి.

తరువాత కొంతసేపటికి నిర్మల సిల్కుచీరలో మెరసిపోతూ గది బయట కొచ్చింది. రేవతి కొత్తకి అందం కొనితెచ్చుకోలేక, దేవుడు వదలిన బొమ్మలాగే నిర్మలను అనుసరించి వచ్చింది.

సిల్కుచీరలో నిర్మల అందాన్ని చూడడాని అమ్మ తొందరపడుతు వచ్చింది.

'నిర్మలా, ఎంత బాగున్నావు. చీర ఎంత బాగా కట్టుకున్నావు!'. మురిసిపోతూ అంది అమ్మ.

'అక్కయ్య కట్టిందే'.

నిర్మలమాటల్లో ఏ భావం గోచరించలేదు రేవతికి.

అమ్మ మురిపం ఆమాట వినడంతో మాడి పోగా, పనివున్నట్లు విసవిసమని వంటింట్లోకివెళ్లింది.

'ఎందుకో అమ్మకు నేనంటె అంతకోపం'. రేవతికి కళ్లల్లో నీళ్లుతిరిగాయి.

అవి నిర్మల చూడకూడదనుకొని దొడ్లోనికి వెళ్లింది.

దొడ్డిలోని జామచెట్టు, ప్రక్కయింటి వేప చెట్టుమీదనున్న గూటిలోని కాకిజంటను ఖించిన అప్పుల్లేరు. కానీ, తనగోడు వినిపించుకోడానికి అది తగిన సమయంకాదని రేవతికి తెలుసు.

బావివద్ద ముఖం కడుక్కొని లోపలకువచ్చింది.

అప్పటికే నాన్న వచ్చినట్టున్నాడు. అమ్మతో విశేషాలు చెబుతున్నాడు.

'ఏడు గంటలకల్లా వారు వచ్చేస్తున్నారు. అంతా రెడీగా వుండాలి' అని నాన్న చెబుతుంటే 'ఎవరు వస్తున్నారు?' అని మరో ప్రశ్న వేసుకొని మనస్సులో దాచుకొనింది రేవతి.

నాన్న ఏదో పనున్నదంటూ యిల్లు వదలి అటు వెళ్లగానే, చిన్నపనున్నదంటూ నాలుగిళ్లవతలి కామాక్షమ్మ యింట్లోకి వచ్చింది.

'సావిత్రమ్మా, ఏమిటి విషయం? చాల పని పెట్టుకున్నట్టున్నావు?'.

అడిగింది అమ్మను.

'మరేం లేదు. పెళ్లిచూపులకి మదనపల్లెవా రొస్తున్నారు.'

సంబరంగా, సంతోషంగా, తేలికగా అమ్మ చెప్పడం విని అక్కడే నిలబడింది రేవతి.

'ఎవరికీ? రేవతికేనా. పోనీలేమ్మా యిన్నాళ్ల కయినా కలిసొచ్చింది.'

సానుభూతి ధ్వనించింది కామాక్షమ్మ మాటల్లో.

ఆమె మాటల్లో వ్యంగ్యంలేనందుకు సంతో షించింది రేవతి.

అంతలో తనకు తెలియకుండానే పెళ్లిప్రయ త్నాలు చేస్తున్నారా --అని ఆశ్చర్యపడింది లోలోపలే.

'అది మాకు ఎక్కువయి ఏడుస్తుంటే, దాని కదొక్కటే తక్కువ.'

రేవతి అమ్మ మాటలు వినకూడదని గది లోనికి పరుగెట్టింది.

కానీ అమ్మ మాటలు వెన్నాడాయి.

'ఆ కొరివిముఖాన్ని ఎవరమ్మా కట్టు కొంటారు.'

'పాపం. రేవతికి అన్నీ తక్కువజేశాడు దేవుడు.'

కామాక్షమ్మ అంటున్న మాటలుకూడ విని పించాయి రేవతికి.

'అమ్మకన్నా కామాక్షమ్మే నయం.'

చాలమార్లు మననం చేసుకొనింది.

'పాపం చేసుకున్నవారు నరకానికి పోతే, చర్మాన్ని చీల్చి వుప్పూకారం కూరుతారు. నోరులేని రేవతిని బాధపెడితే నీ కంతకన్న ఘోరమైన శిక్ష పడుతుంది.'

నాయనమ్మ అమ్మతో ఆ మాటను ఎన్నో మార్లంది.

'అమ్మకు అలాంటి శిక్ష వద్దు.' అని నాయ నమ్మతో చెప్పాలనుకొనేది రేవతి ప్రతిసారీ.

అబ్బరంగా ఆరేళ్లు సాకి రేవతిని అనాథనుచేసి వెళ్లిపోయింది నాయనమ్మ.

'నాయనమ్మ ఎక్కడ పుట్టి పెరుగుతోందో ఏమో?' పునర్జన్మ అనేది వుందని రేవతి నమ్మకం. అమ్మ ఒక్కసారయినా తనతో నవ్వుతూ మాట్లా డితే తన కంతే చాలనుకొనేది రేవతి. ఆలోచనలతో మనస్సు బరువెక్కిపోయి కళ్లు చెరువులయ్యాయి.

'అమ్మా, నాన్నా తనకు అన్యాయం చేస్తు

న్నారు. తనకు యిరవైఏడో సంవత్సరం. చెల్లెలికి పద్దెనిమిదో సంవత్సరమే. తనకంటే ఎంతో చిన్నది.

అయినా దానికిముందే చేసేస్తున్నారు.'

మనస్సు పరిపరివిధాల ఆక్రోశిస్తోంది.

రేవతి వునికిని గురించి పట్టించుకొనేవారు లేరు గనుక, చీకటిపడిన తరువాతకూడ ఏడుస్తూ గదిలోనే వుండిపోయింది. ఆలా ఏడవడం, తనగోడు జామచెట్టుకో, కాకిజంటకో మొరబెట్టుకోవడం, వాటినుండి సానుభూతి లభించినట్టుగా వూరట చెందటం రేవతి కలవాటు.

ఇంతలో హాల్లో గలగలమని మాట్లాడు తున్నట్టు శబ్దమయ్యింది. రెండు మూడు కొత్త స్వరాలుకూడ వినిపించాయి. వారెవరో తెలుసుకోవా లన్న కుతూహలం పెరిగి, రేవతి గది తలుపులు మెల్లగాతీసి చూసింది. హాల్లో జంబుఖానామీద నాన్న, మరి ముగ్గురు క్రొత్తవారు కూర్చొని వున్నారు.

పాంటు టకప్ చేసినతనే కాబోలు నిర్మ లకు వరుడు – అనుకొనింది రేవతి.

వారు అమ్మ తయారుచేసిన ఫలహారాలు తీరిగ్గా తింటూ మాట్లాడుకొంటున్నారు.

రేవతి దృష్టి వరునిమీదనే నిలచింది.

'అబ్బ, సన్నగా, ఎర్రగా, నాజూగ్గా ఎంత అందంగా వున్నాడు. నిర్మల అదృష్టం చేసుకొని పుట్టింది. తనకీ జన్మకు ఆలాంటి రాతలేదు.'

తన దురదృష్టాన్ని నిందించుకొంటూవే, నిర్మల అదృష్టాన్ని గురించి ఆలోచిస్తోంది.

నాన్న చేసిన సైగతో అమ్మ నిర్మలను పిలుచు కొనివచ్చి వారికెదురుగా కూర్చోబెట్టింది.

'సాయంకాలం కట్టిన మొగ్గలు అప్పుడే విరి సాయి.'

నిర్మల జడలోనున్న పూలు చూస్తూ అను కొనింది రేవతి.

'అదృష్టవంతుల జాతకాలుకూడ ఆలా విరిసి పోతూంటాయి'—

మనస్సులో లీలగా మెదలిందా భావన.

పెళ్లి చూపులు అయిందనగానే నిర్మల, అమ్మ హాలునుండి నిష్క్రమించారు.

'అలా తిరిగొస్తానని' వరుడు వెళ్లిపోయాడు.

వెళ్లుతున్న అతన్నిచూస్తూ, 'మెరుపులా ఎంత అందంగా నడుస్తాడు.' అనుకొనింది. అతన్ని అప్పుడే మరోసారి చూడాలని ఆసక్తి కలిగింది రేవతికి. కాని, అతనప్పటికే కనుమరుగయ్యాడు.

వరుని తండ్రి అయ్యుంటాడు, నాన్నను అడుగు తున్నాడు రేవతిని గురించి.

నాన్న ఏమి జవాబు చెబుతాడేమోనని రేవతి వూపిరి బిగబట్టి, చెవులు నిక్క బొడుచుకొనింది.

'అది దానికి శాపమో, మాకు శాపమో గానీ యండి, దానికి మూగతనం, వికృతరూపం ప్రసా దించాడు దేవుడు. అయినా తండ్రిగా నాకర్తవ్యం నేను చేయాలిగా. పది సంవత్సరాలు పెళ్లి ప్రయ త్నాలు చేశాను. ఎవరు ధైర్యంగా ముందుకొస్తారు చెప్పండి? అందుకని ప్రయత్నాలు మాన ననుకోండి. దైవం ఎలా రాశాడో ఏమో?'

తన వేదాంతాన్ని జోడించి నాన్న కాబోయే వియ్యంకుడికి చెబుతుంటే కన్నుల్లో నీళ్లు తిరిగినా కోపమొచ్చింది రేవతికి.

'అంతా పచ్చిఅబద్దం. నన్ను ఒక్కనాడు పెళ్లికూతురిలా సింగారించలేదు. నాన్నదంతా కపట నాటకం' అని ఎలుగెత్తి గట్టిగా అరవాలనిపించింది రేవతికి.

కాని, తనకటువంటి అవకాశంలేదని తెలిసే సరికి; కళ్ళల్లో తిరుగుతున్న నీళ్ళలా, గొంతును పూడ్చేస్తున్న దుఃఖంలా మనస్సులోనిమాటలు మనస్సు లోనే గిర్రున తిరిగిపోయాయి.

నులక మంచంమీద పడిపోయిన రేవతికి మెల కువ వచ్చేసరికి అందరు భోజనాలుముగించి తాంబూ లాలు సేవిస్తున్నారు.

మెల్లగాలేచి అన్నం తినడానికని వంటయింటి

లోనికి వెళ్లింది. అన్నంఅంటే అసహ్యంపుట్టి జామ చెట్టు క్రిందికి వెళ్లింది.

'చూశావా ? అమ్మా నాన్న చేస్తున్నపని'.

కన్నీళ్లతో, గద్గదమయిన మనస్సుతో మొర పెట్టుకొనింది రేవతి.

వేపచెట్టులోని కాకిజంట కాపురం వెలగబెట్ట డంలో రొదజేస్తున్నాయి.

గాలికి జామచెట్టు వూగింది. పండొకటి రాలింది. రేవతి ఆనందంతో దాన్నితింటూ కాకిగూటి వంక జూస్తోంది.

రాధ, సుజాతలు గుర్తొచ్చారు. వారుకూడ వారివారి కాపురాలు య్యాలా గలగలలాడుతు చేస్తుం టారు. పెళ్లయిన తరువాత నిర్మలకూడ అంత కన్నా ఎక్కువసంతోషంతో వుండాలి. తనచెల్లెళ్లకేం అప్సరసలు. వారి నలా సృష్టించి దేవుడెంతో మేలు జేశాడు. లేకపోతే, అమ్మ ఎంతగా కుమిలిపోయేది పాపం !...రేవతి ఆలోచనలకు ఒక దరిలేదు.

రాధ పెళ్లికిరమ్మని బలవంతం చేసింది. తను సుజాతతో కలిసివెళ్లింది. తరువాత త్వరలోనే సుజాత పెళ్లికూడ అయ్యింది. సుజాతే చెప్పింది, తనకు ఆయ నకు రాధపెళ్లిలో పరిచయం అయిందట. ఇద్దరు ప్రేమించు కున్నారుట. ఆయన తల్లిదండ్రులు పెళ్లికి వొప్పుకున్నారట ...

తనుకూడ ఎవరినయినా ప్రేమిస్తే—తన ఆలో చనలకు తనే చిలిపిగా నవ్వుకొనింది రేవతి.

నిర్మల పెళ్లికి యిరువైపుల బంధువర్గమంతా వచ్చింది. రేవతికి అందరిమధ్య మెరపులా తిరగాలని వుంది. అమ్మ చూస్తే కోప్పడుతుందేమోనన్న భయం కూడ వుంది. అయినా వున్నంతలో మంచి చీరకట్టు కొని సింగారించుకొనింది.

నిర్ణీతమయిన పని లేకున్నా పనివున్నట్లే తిరుగసాగింది పెళ్లి ఇంట్లో. కాని రేవతిని గమనించిన వారు లేకపోయారు. నిరాశతో నిలువెల్లా వణకి పోయింది.

వయస్సులో నున్నవాడు తనవైపు సాభి ప్రాయంగా చూస్తే, అతనివైపు చూచి చిరునవ్వు నవ్వాలని వుంది. అయినా అవకాశం రాకపోతుందా అని ఒక స్తంభం పట్టుకొని నిలబడింది. ఎవరికివారు వస్తున్నారు, పోతున్నారు. తనను దాటిపోతున్నారు. దాటి వస్తున్నారు. కాని తనక్కడ నిల్చున్నట్టే ఎవరికీ గుర్తులేదు.

మ్యూజియంలోని పురాతనశిల్పంలా వున్న తను ఎవరిని ఆకర్షించగలుగుతుంది? నిరాశ కలిగింది. నిస్పృహ ఆవరించింది. మనస్సు బరువెక్కిపోగా తేలికబరచుకొనేందుకు జామచెట్టువద్దకు వెళ్లింది.

జామచెట్టువద్ద పందిరివేసి వంటపని జేస్తు న్నారు. అయిదారుగురు పనివాళ్లు వంటపనిలో నిమగ్నులయి వున్నారు.

రేవతి బండమీద కూర్చొని వారినే గమ నిస్తూ వుంది. అందులో ఒకనిపై రేవతి దృష్టి నిలచింది. పొట్టీపొడుగుగాని విగ్రహం, బలమయిన చేతులు, కోలముఖం, ఆకర్షణీయమయిన మీస కట్టు, రేవతిని ఆకర్షించాయి. పొయ్యివేడికి చెమట బట్టి ముఖంపైన స్వేదబిందువులు ఆణిముత్యాల్లా మెరుస్తున్నాయి.

చల్లనిగాలికోసం యివతలికి వచ్చాడతను, ముఖాన బట్టిన చెమటను తుడుచుకొంటూ.

రేవతి అతన్నే తదేకంగా చూస్తోంది. అతను రేవతివైపు క్షణకాలం చూచి, చిరునవ్వు నవ్వాడు. రేవతి ఒక్కసారిగ పులకించిపోయింది. శరీరంలో విద్యుత్తు జనించినట్లుగా కంపించిపోయింది.

నల్లని ఆకాశంలో మెరపులా అతని చిరునవ్వు ఎంత అందంగా వుందని జామచెట్టుతో లోలోపలే అంది. మనస్సు నిండుగా సంతోషంగా వుంది.

ఆలస్యం చేయకూడదనుకొని, తనుకూడ చిరునవ్వు నవ్వింది రేవతి.

అతను మరల నవ్వాడు.

రేవతి మరల మరల నవ్వింది.

అతను మునిపళ్లతో క్రింది పెదవిని కొరు కున్నాడు.

*　　　*　　　*

నిర్మల పెళ్లి జరిగిపోయింది. అత్తవారింటి నుండి మళ్లీ పుట్టింటికి వచ్చింది. అక్కడి సంగతు

లన్నీ అమ్మతో ఏకరువు పెడుతోంది. భర్త తనపై చూపిన అనురాగాన్ని పూసగ్రుచ్చినట్లు అరమరికలు లేకుండా చెబుతోంది.

తనకు పెళ్ళయివుంటే ఉయ్యాలాంటి సంబరమే పడేది-అనుకొనింది రేవతి.

నిర్మలకు నెల తప్పింది. అమ్మ సంతోషానికి మేరలేకపోయింది. నాన్నను, అల్లుడుగారిని రమ్మని వెంటనే వుత్తరం వ్రాయమంది. ఇంటిల్లపాదికి ఆ రోజు పండగయ్యింది.

తనకు నెల దాటిందని లెక్కపెట్టుకొని భయపడింది రేవతి. ఇంటిలో తన నెవరు పట్టించుకోరు గనుక కొంత ధైర్యం. కానీ, ఆ ధైర్యం చాలకాలం నిలువలేదు.

తనలో 'అతను' పెరుగుతువ్నాడేమోనని రేవతి అనుమానం. జామచెట్టుతో చెప్పుకొనింది.

కాకిజంట గుర్తుకు రాగానే వాటిలా తను కూడ కొన్ని క్షణాలు తృప్తిగా బ్రతికాననుకొనింది.

కాని అంతలోనే ఒక్కక్షణంకోసం ఒక్క జీవితాన్ని నాశనం చేసుకున్నాను కదాని ఖేదపడింది.

రాను రాను, ఒకనాడు చేసిన తొందరపని పాపపు పుట్టలా పెరగజొచ్చింది, తన సంగతి కొంతకాలానికయినా బయటపడకపోదు. ఆ నాడు యింటా బయటా తనను చిత్రవధ చేయకపోరు...

తను పొరబాటే చేసింది.

అంతగా తొందరపడి వుండకూడదు...

నల్లటి ఆకాశంలాంటి 'అతని' విశాల వక్షస్థలం తను ఆశించియుండకూడదు...

తను అగ్నిని వొడిగట్టుకొనింది. అది తనను దహించివేస్తుంది...యింటిలోని అందరిని దహించి వేస్తుంది.

పెళ్ళి కావలసిన మరి యిద్దరు చెల్లెళ్ళకు తన కళంకిత రూపం ఘోరంగా, వికృతంగా అడ్డు నిలుస్తుంది. ఆ పసి హృదయాలు తనకోసం బలయిపోతాయి.........

తన తొందరపాటుకు పర్యవసానం కంటిముందు తిరుగసాగింది.

కాకిజంట తన అనుచిత ప్రవర్తనకు నవ్వసాగాయి.

జామచెట్టు సానుభూతి చూపడంమాని వికృతంగా అపహాస్యం చేస్తోంది.

అమ్మ ఒక మూల, చెల్లాయిలు మరో మూల దుఃఖంతో కుళ్ళిపోతున్నారు. నాన్న అవమానంతో నలుగురిలో ముఖం దాచుకొని తిరుగుతున్నాడు. తన స్నేహితురాండ్రు నవ్వుకొంటున్నారు. ఇరుగు పొరుగులు సూదుల్లా నవ్వుతున్నారు...

దుర్భరమైన జీవితం కళ్ళముందు తిరుగసాగింది...

రేవతి భరించలేకపోయి భోరున ఏడ్చింది.

తను లేకపోయినా ఎవరికీ బాధలేదు. తన్ను జూచి అమ్మా, నాన్న సంతోషపడిందీ లేదు. ముఖ్యంగా తనంటె ఎవరికీ ఆదరణ లేదు.

ప్రేమ కరువయిన జీవితం వృధాయని తోచింది రేవతికి.

రేవతి మనస్సును విషాదం క్రమ్మినట్లుగా, ఆకాశాన్ని చీకట్లు కప్పివేశాయి. కాకిజంటవద్ద, జామచెట్టువద్ద సెలవు తీసుకొని బయలుదేరింది.

రైలు దూరంగా ఎక్కడో కూతపెట్టింది.

రేవతికి నాయనమ్మ గుర్తుకొచ్చింది. ఆ వెంటనే అమ్మ గుర్తుకొచ్చింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

'అమ్మకు శిక్షవద్దు'. అని కడపటిసారిగా అనుకొనింది.

దూరాన వస్తున్న రైలు దగ్గరకు రావడంతో రైలుపట్టాలు గడగడలాడాయి. రేవతి గుండె దడదడలాడింది.

భయంగా ఆకాశంవంక చూస్తోంది.

నల్లటి ఆకాశం, నక్షత్రాలను ఒళ్ళంతా కళ్ళు చేసుకొని తననే చూస్తోంది.

రైలు మీద మీదకు వచ్చేస్తోంది పాపం వంటి చీకటిని చీల్చుకుంటూ.

రేవతి నాదుకొందామని ఒక నక్షత్రం రాలిపడింది.

* * *

'అశ్వనీ నక్షత్రం పుట్టిందని' పంచాంగాలు ఘోషించాయి.